మీ-సేవా నిర్వాహకులకు ఈ -కామర్స్‌పై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవలు నిర్వహించడం వల్ల ఈ-కామర్స్ రంగంలో పెను మార్పులు వస్తాయని మీ-సేవా కమిషనర్ రవికిరణ్ తిరుమల అన్నారు. ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ఐటీశాఖ సంయుక్తాధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో గురువారం మీ-సేవా నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవల వల్ల స్థానిక ఎంఎస్ఎంఈ వ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ దీపు థామస్ జాయ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,

చార్మినార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతదయాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. గురువారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ మెంబర్లు కంచెర్ల వందన, మర్రిపల్లి చందన, బి. అపర్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఉమెన్ సేఫ్టీ వింగ్ కమిషనర్ లావణ్య నాయక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో బ్లడ్ డెలివరీ సేవలు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ సేవలను లైటస్ పేరుతో నగరంలో గురువారం ప్రారంభించారు. ఏఐ ఆధారిత బ్లడ్ లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్‌గా దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలోనే దీన్ని ప్రారంభించామని లైటస్ హెల్త్‌టెక్ సీఓఓ సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు. ఇప్పటి వరకు చెన్నైలో 5 వేల మందికి రక్తం సరఫరా చేశామని, దీనికి రెడ్ క్రాస్ సొసైటీ నుంచి అవార్డు వచ్చిందన్నారు. నగరంలో సుమారు 100కు పైగా బ్లడ్ బ్యాంకులు ఉండగా, ఏడాదికి 2,75,000 యూనిట్ల రక్తం అవసరం ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా సరైన సమయంలో రక్తం అందించలేకపోతున్నారు. దీన్ని గుర్తించి హైదరాబాద్‌లో బ్లడ్ బ్యాంకులు, ఆస్పత్రులతో కలిసి సేవలను అందించనున్నామని సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఎయిర్ చీఫ్ మార్షల్

అల్వాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ)లో ఈనెల 14న నిర్వహిస్తున్న 215 కోర్స్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా భారత వాయుసేనాధిపతి(ఎయిర్ చీఫ్ మార్షల్) అమర్ ప్రీత్‌పాల్‌సింగ్ పాల్గొంటున్నారని రక్షణ శాఖ పౌర సంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన కీలకపాత్ర పోషించారు.

రౌడీషీటర్ హత్యకు పథకం

● మరో ముఠా సభ్యుల అరెస్ట్.. 12 కత్తులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పథకం వేసిన రౌడీషీటర్‌తోపాటు గ్యాంగ్ సభ్యులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 కొబ్బరి బొండాం కొట్టే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పహాడిషరీఫ్‌కు చెందిన మహ్మద్ జబ్బార్(43) పాత నేరస్థుడు. గతంలో రౌడీషీటర్ ముర్తుజా అలీ వద్ద పనిచేసేవాడు. జబ్బార్‌పై ట్రై కమిషనరేట్ల పరిధిలో హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, స్నాచింగ్ వంటి 12 కేసులు నమోదయ్యాయి. ఇతడిపై పోలీసులు రెండుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేయగా జైలుకెళ్లొచ్చాడు. ముర్తుజా వద్ద పనిచేయడం మానేసిన తర్వాత సొంత గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ముర్తుజాను చంపేందుకు జబ్బార్ పలు ప్రయత్నాలు చేశాడు. అలీని చంపేందుకు జమీర్ ఖాన్(30), రౌడీషీటర్ సయ్యద్ షాఅబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్(22), మహ్మద్ రహమత్ అలియాస్ సోను(28), సయ్యద్ షా అబ్దుల్ మన్నాన్ అలియాస్ సల్మాన్(31), మహ్మద్ నాసిర్(38)తో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. హత్య కోసం 12 కొబ్బరి బొండాలు కొట్టే కత్తులు కొనుగోలు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 12 కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు మొహసిన్, అజహర్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

● వెన్నెముకలో క్యాన్సర్ కణితి తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న మహిళకు కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళ (55) నడవలేని పరిస్థితిలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెన్నెముక భాగంలో క్యాన్సర్ కణితి పెరిగి పక్షవాతం స్టేజ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. క్యాన్సర్ కణితి తొలగించేందుకు 'ఎన్ బ్లాక్ రీసెక్షన్' శస్త్రచికిత్స చేశారు. మొదటి దశలో ఇంటర్‌వెన్షన్ 'ఎంబోలైజేషన్' పద్ధతిలో రోగికి ఇంజెక్షన్ ఇచ్చి, క్యాన్సర్ కణజాలానికి రక్తప్రవాహాన్ని నిలిపివేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన 24 గంటల తర్వాత వెన్నెముకలో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించారు. కణితి తొలగించిన ప్రాంతంలో ఇంప్లాంట్ అమర్చి నరాలపై ఒత్తిడి లేకుండా శస్త్ర చికిత్సను ఆరు గంటల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె నడవగలిగే స్థితికి చేరుకున్నారని డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్‌కు చెందిన ఆలియా భర్తతో గొడవపడి బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. భర్త వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పగా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె ఈనెల 7వ తేదీన సంజీవయ్య పార్కు సమీపంలో రైల్వే పట్టాల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న తండ్రి మహ్మద్ అక్కడకు వెళ్లి కుమార్తెకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సమయంలో సికింద్రాబాద్ నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఆలియా అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన మహ్మద్‌ను స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



● సంక్షేమ భవన్ ముట్టడి

గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని సంక్షేమ భవన్‌ను ముట్టడించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు.

బడి బతకడం నేర్పిస్తుంది

● పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి
● విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు గోపాల్, వెంకటేష్
● తొలిరోజు సందడిగా స్కూళ్ల ప్రాంగణాలు



నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే గోపాల్ తదితరులు

కవాడిగూడ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ బడీడు పిల్లలను ప్రభుత్వపాఠశాలలో చేర్పిస్తే, బడి పిల్లలకు జీవితాంతం బతకడం నేర్పిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనలు అందిస్తున్నారని, నిరుపేద చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి, ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడొద్దని ఆయన పిలుపునిచ్చారు. గురువారం వేసవి సెలవులు ముగిసిన తరువాత పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా కవాడిగూడ ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ హాజరయ్యారు. విద్యార్థులకు, నూతనంగా పాఠశాలలో చేరినచిన్నారులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ మండల డిప్యూటీ ఏఓఎస్ జయభారతి, కవాడిగూడప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలహెచ్ఎం మీనాకుమారి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్.పావన, ఉపాధ్యాయులు నాగేష్, జాని, సుబ్రమణ్యం, వంశీ, వీణ, వసంత, మమత, శిరీష, శైలజ, స్వప్న, అనిల్‌కుమార్, సంధ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, ఓబీసీ మోర్చానగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధానకార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ, నాయకులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కవేలిగ్రౌండ్ స్కూల్‌లో బడిబాట

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కవేలిగ్రౌండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠశాల ఘనస్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారం అందజేశారు. పాఠశాలలో నూతనంగా చేరిన పిల్లలకు చాక్లెట్లు, పూలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ మేడే దేవదాసు, ఉపాధ్యాయులు శోభారాణి, సునీత, మెరిలా, ప్రవళిక, నాగరాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముడారపు రాకేష్‌కుమార్, పోతుల శ్రీకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



కాచిగూడలో విద్యార్థులకు డ్రస్‌లు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి కోరారు. గురువారం పాఠశాలలు ప్రారంభం సందర్భంగా కాచిగూడ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ డ్రస్సులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తల్లిదండ్రులు ప్రైవేటు, కార్పొరేట్ మోజును వీడ తమ పిల్లలను గుణాత్మకమైన విద్యకోసం ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు క్షీరసాగర్, సుభాష్ పటేల్, అరవింద్, లావణ్య, వాసు, బీమ్‌రాజ్, ఆర్ సంతోష్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

రాంనగర్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాటలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధానకార్యదర్శి కె.సురేందర్, నాయకులు సుధాకర్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, యూనిస్, అనురాధ, హరీష్, సురేష్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌అంబర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

● బాగ్అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీరమణ కేంద్రం పక్కన గల ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాటలో కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను, దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదువుకోవాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునే విధంగా పాఠశాల స్థాయి నుంచే ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభకావడంతో తొలిరోజునే గోల్నాక డివిజన్ తులసీరాంనగర్(లంక) బస్తీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అస్రా ఫాతీమా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు గణేష్, ఐఫోకస్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకులు పులిజాల గెల్వయ్య, ఎ.సురేష్‌గౌడ్, ఎమ్మెల్యే తనయుడు, బీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు కాలేరు మనికాంత్ పాల్గొన్నారు.



సత్యానగర్ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో..

నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్, భాగ్యనగర్‌లో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో గురువారం జరిగిన బడిబాట కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ యాకర అమృత విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. - **నల్లకుంట, ఆంధ్రజ్యోతి.**



అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాటలో పాల్గొన్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

అంబర్‌పేటలో బడిబాట

అంబర్‌పేట: అంబర్‌పేట డివిజన్‌లోని సీపీఎల్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన బడిబాటలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బాయిస్ హైస్కూల్ హెచ్ఎం మహేశ్వర్, సీపీఎల్ హైస్కూల్ హెచ్ఎం సుశీలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో రాజకీయాలు వద్దు : ఎమ్మెల్యే గోపాల్

● చెత్త రాజకీయాలు చేస్తున్నారు కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు తీర్చే విధంగా అభివృద్ధి పనులు కొనసాగాలని అందులో రాజకీయాలు వద్దని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఘాటుగా స్పందించారు. నిబంధనల ప్రకారం రోడ్లు వేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆయన సూచించారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్‌లో రూ.18లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, జీహెచ్ఎంసీ డీఈ గీతాకుమారి, ఏఈమురళితో కలిసి ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొంతమంది రాజకీయ దురుద్దేశంతో నిర్మాణ పనులకు అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. వర్షాలు కురుస్తున్నాయి. పనుల్లో జాప్యం జరగకుండా వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులకోసం పోరాడుతుంటే ఇతర పార్టీల నేతలు చెత్తరాజకీయాలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు అని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు, జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో ముషీరాబాద్ సమస్యను ప్రస్తావించడం వల్లే నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు ముషీరాబాద్ డివిజన్‌లో అధ్వానంగా ఉన్న 35 రోడ్లను ఆధునికీకరించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్, పార్టీ సీనియర్ నాయకులు శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పి.శ్రీధర్‌చారి, డివిజన్ ఉపాధ్యక్షులు బల్ల ప్రశాంత్, క్రాంతి, జి.రాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కార్తిక్‌యాదవ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు జమాల్‌పురి నందు, బీజేవైఎం నగర నాయకులు అనిల్‌కుమార్, కుషాల్‌గౌడ్, ఆయూష్ పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలపై పోరాటానికి విద్య ప్రధానం

చిక్కడపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతలపై పోరాటానికి విద్య ప్రధానమని ఎమ్మెల్సీ ఎస్.వాణీదేవి అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రాగసప్తస్వరమ్ నాలుగు దశాబ్దాల వేడుక సందర్భంగా వైద్య విద్యారంగాలకు చెందిన ప్రముఖులతో అవగాహన ప్రసంగాలు గురువారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ఏర్పాటు చేశారు. డా.విజయభాస్కర్ మోకాళ్ల నొప్పులు, డా.రమ్య రొమ్ము క్యాన్సర్ సమస్యలు, డా.జ్యోత్స్నారావు న్యూక్లియర్ వైద్యవిధానం, సర్వమంగళగౌరి విద్యావిధానం, డా.శరత్‌జ్యోత్స్నారాణి పిల్లల పెంపకం, పద్మావతి గృహహింస, డా.పద్మావీరపనేని స్త్రీ సమస్యలపై ప్రసంగించారు. వాణీదేవి పాల్గొని ప్రసంగకర్తలను సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించారు. జీవితబీమాసంస్థ ప్రతినిధి సుబ్రహ్మణ్యం, యూబీఐ అధికారి శ్రీనివాస్, వంశీరామరాజు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికే పార్టీ పదవులు

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతానికి, క్రమశిక్షణతో పనిచేసేవారికి పార్టీ ఉన్నత పదవులు, నామినేటెడ్ పదవులు దక్కుతాయని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం భవానీ శంకర దేవాలయ కమిటీ నూతన చైర్మన్ మేడి సురేష్ కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు జి.నాగభూషణం, ఆర్.కల్పనాయాదవ్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ముషీరాబాద్ నియోజకవర్గంలో సైనికుల్లా పనిచేసే పార్టీ నేతలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, సీనియర్ నాయకులు మురళీమోజెస్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను, టీపీసీసీలో పదవులు పొందిన కల్పనాయాదవ్, నాగభూషణంను సన్మానిస్తున్న భవానీ శంకర ఆలయ కమిటీ చైర్మన్ సురేష్ కుమార్

కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం

నల్లకుంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట మండల కార్యాలయంలో అధికారులు కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్ల జారీలో తీవ్రనిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ నాయకులు ఆరోపించారు. గురువారం నల్లకుంటలోని సంఘం కార్యాలయంలో జరిగినసమావేశంలో లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ మోచీ సర్టిఫికెట్లకు అంబర్‌పేట మండల కార్యాలయంలో ఆర్ఐ ఇతర సిబ్బంది బాధితులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తండ్రి సర్టిఫికెట్ ఉన్న తర్వాత కూడా మోచీ సంఘర్ కుల సర్టిఫికెట్ ఇవ్వడానికి రూ.50 సంవత్సరాల ముందు నుంచి పత్రాలు తీసుకురావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఆ పత్రాలు ఇచ్చిన తర్వాత కూడా రోజులతరబడి వారిని ఇక్కట్లకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంలో తగుచర్యలు తీసుకోని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో అంబర్‌పేట మండల కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హెచ్.రవికుమార్, ఆర్.రాజేందర్, కల్యాణి, ప్రభురాజ్, కె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

11ఏళ్ల మోదీ పాలనపై సేవా కార్యక్రమాలు : బీజేపీ

బర్కత్‌పుర, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11ఏళ్లు నిండిన సందర్భంగా ఈనెల 25 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎస్.కుమార్ తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఉత్సవాల కమిటీ కన్వీనర్ యేడెల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పాలన అవినీతి కుంభకోణాలలో కూరుకుపోయిందని, మోదీ 11ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదని అన్నారు. ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయని వారు అన్నారు. దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మేధావులతో సమావేశాలు, డివిజన్ల వారీగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ నేతలు అల్లూరి రామకృష్ణ, హరిచరణ్, సి.కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి : జేఏసీ



మాట్లాడుతున్న వెంకటేశం, ఎస్‌కే.జమ తదితరులు

నల్లకుంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కొత్తగా ఓఆర్ఆర్ పరిధిలో ఎలక్ట్రిక్ ఎల్‌పీజీ, సీఎన్‌జీ రెట్రో ఫిట్‌మెంట్‌కు అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), ఎంఏ.సలీం (యూటీఏడీడబ్ల్యూఏ), ఎస్‌కే.జమ (జీహెచ్ఏడీయూ), ఎస్.అశోక్(ఏఐటీయూసీ), నాయకులు ఎండీ.ఆజారుద్దీన్, ఠాకూర్‌జైసింగ్, సయ్యద్ అహ్మద్ తదితరులు మాట్లాడారు. కొత్త ఆటో పర్మిట్లకు ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల ఆటోడ్రైవర్లకు సంతృప్తి కలుగుతుందన్నారు. అదేవిధంగా కొంతకాలంగా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని వారు కోరారు. ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఓలా, ఉబర్, రాపిడో, ఉబర్, ద్వారా అక్రమ టూవీలర్లను నిషేధించాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలు పెంచాల డిమాండ్ చేశారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. కవాడిగూడ 11కేవీ ఫీడర్ పరిధిలోని మారియట్ హోటల్, కవాడిగూడ పెట్రోల్‌పంప్ ఎదురువీధి, కొత్తబజార్, హనుమాన్‌టెంపుల్, సంధ్య బార్, పద్మశాలీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, గోశాల పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్, అంబేడ్కర్ భవన్, రజకకాలనీ, సర్దార్‌జీ పంప్‌హౌస్, తాతానగర్, సింగాడీబస్తీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విమాన ప్రమాదం బాధాకరం: టీజేఎస్

చిక్కడపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో విమానప్రమాదం బాధాకరమని టీజేఎస్ ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. టేకాఫ్ అయిన అయిదునిముషాలకే ఈదుర్ఘటన చోటు చేసుకోవడం ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమని పేర్కొంటూ ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఇలాంటి దుస్సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రమ కట్టడం కూల్చివేత



కూల్చివేత పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్య

ముషీరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బ్రహ్మంగారి దేవాలయం వీధి సమీపంలో అక్రమ కట్టడాన్ని గురువారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యకు స్థానిక రాంనగర్ దళిత జాతీయ సంఘం నేతల ఫిర్యాదు మేరకు అధికారులు నూతన నిర్మాణ భవనాన్ని పరిశీలించి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ.... జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దళిత జాతీయ సంఘం అధ్యక్షుడు సునీల్, నాయకులు భాస్కర్, సదాతదితరులు మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ కట్టడాన్ని పూర్తిగా కూల్చివేయాలని డిమాండ్ చేశారు.